★ సర్వం కృష్ణమయం!

కృష్ణాష్టమి సందర్భంగా

-అద్దేపల్లి సుచిత్రాదేవి



బృందావనం!

పున్నమి రేయి! వెన్నెల వెండి వెల్లువై జగతిని ఆహ్లాదంలో ముంచెత్తుతోంది.

పాల వెన్నెల, పిల్ల తెమ్మెర, పూల పరిమళమూ మూడూ కలిసి మనసును సమ్మోహన పరుస్తున్నాయి.

ఆ సమయంలో అదో ఆ పొగడ చెట్టు కింద కలువలాంటి కనులు తెరుచుకునే వున్నా మనసక్కడ లేక ఓ దివ్యానుభూతిలో మైమరచి, దైవపూజకై విరిసిన శ్రీ పారిజాత సుమంలా కూర్చుని వుంది రాధాదేవి.

అన్ని నాయికా లక్షణాలు ఏకమైపోయి ఏ కావ్య నాయికకూ అందని మహోన్నత రీతిలో, అలౌకిక సౌందర్యంతో, అమరత్వాన్ని తనలో అంతర్లీనం చేసుకుని, ప్రణయమన్న పదానికి ప్రతీకలా, పరమార్థంలా వుందామె రూపం!

పూల పరిమళాన్ని తనలో కలుపుకున్న పిల్ల తెమ్మెర వెన్నెలతో కలిసి వచ్చి రాధిక ముందు నిలిచి ఆమె మేలి ముసుగును సుతారంగా సవరిస్తూ అడిగింది.

"సదా ఈ బృందావనిలో తిరుగాడే రాధికా, మా ముప్పురిలో ఎవరి వలన ఈ వనమంతా అందాన్నీ, అపురూపత్వాన్నీ ఆపాదించుకుందో, మాలో ఎవరు గొప్పో చెప్పవమ్మా?" అని.

నన్నని నీటి పొరలామె కన్నుల్లో, చిన్న దరహాసం మామె పెదవులపై.

"నందకిశోరుని మురళీగానముకన్నా ఏ మలయ మారుతమూ, ఆ శ్యామ సుందరుని మోవి మీలమీల కన్నా ఏ వెన్నెల కిరణాలూ, ఆ మధుర మంద హాసాలకన్నా మరే సుమసౌరభాలూ నాకు మిన్నగా అనిపించవు!" రాధిక పెదవి విప్పలేదు కానీ ఆ భావనలే ఆమె నుంచీ అందాయి.

అంతే. అవి సిగ్గుతో తల వంచుకుని తడబడుతూ మెల్లగా తప్పుకున్నాయి.

మధురమైన స్వప్న జగతిలో కృష్ణ సాన్నిధ్యాన్ని అనుభవిస్తున్న రాధిక కల చెదిరినదయి, తన పక్కన వెన్నుని కానరాక, ఆ కఠిన వాస్తవాన్ని అంగీకరించలేక మధురభక్తితో లేచి ముందుకు సాగింది.

"హే కృష్ణా! మురళీధరా, రాధామనోహరా! నన్నెందుకిలా ఒంటరిదాన్ని చేసి వెళ్ళిపోయావు. నీవు దూరమై ఈ రాధిక బ్రతుకగలదన్న ఊహతోనే వెళ్ళావా? నేనేం కావాలని ఇంత సాహసానికి ఒడికట్టావు?

అవునులే నీ సాహసమే విజయమయిందని నవ్వుకుంటున్నావు కాబోలు. నేనింకా బ్రతికే వున్నానని నువ్వనుకుంటున్నావు కదూ కృష్ణా! ఈ శరీరంలో ఆత్మ లేదు ప్రభూ! అది నీతోనే వెళ్ళిపోయింది. దైవం లేని కోవెలలా ఈ శరీరం నడయాడుతూంది అంతే.

ఏదో ఓ శుభదినాన నిన్ను మళ్ళీ చూస్తాననీ, నీలో కలిసిపోగలననే ఆశతోనే ఈ తనువున శ్వాస వుంది. నువ్వు వస్తావనీ, నీ ప్రియ మురళీగానం ఈ చెవులకు మళ్ళీ వినిపిస్తుందనీ, నీ దివ్య మనోహర రూపం ఈ కనులలో వెలుగులు నింపుతుందనీ ఎదురుచూస్తూనే బ్రతుకగలుగుతున్నాను స్వామీ. నీవు వస్తావన్న ఆశే నాకు శ్వాస!

మాధవా, నీవు నన్ను వదిలి వెళ్ళావని తెలిసీ నాలో ఇంకా అసలు వూపిరి వుందంటే నేనెంతటి కఠినాత్మురాలనో అనుకుంటున్నావా? ఊహు కాఠిన్యత నాది కాదు. ముమ్మాటికీ నీదే. కృష్ణా, చిన్నవాడు వేపల్లెలోని ఇండ్లలో దూరి తిన్న వెన్నంతా కరిగి నీ హృదయంలో నిండివుందనీ అనుకున్నాను కానీ, నీవు నవనీత చోరుడివే కాదు నవనీత మనస్కుడవనీ మురిసిపోయానే కానీ నీదింత శిలా హృదయం అని అనుకోలేదు.

నీ సన్నిధి నోచుకోనంత అపరాధం నేనేం చేశాను ప్రభూ? ఎంత ఆలోచించినా నేను నీ కడ చేసిన అపరాధం తోచుటలేదే? అపచారమే జరిగినా అది ఈ జన్మలోది మాత్రం అయివుండదు. ఎంతటి విష సర్పమైనా వేదుకున్నంతనే అభయ మొసంగి వరాలిచ్చిన కరుణామయుడివే. ఒకవేళ నా వలన ఏదేని అపరాధమే జరిగినా నీ రాధను క్షమించలేవా? నీ రాధను ఆదరించలేవా?

కేశవా, అసలెందుకీ వియోగం? నాపై నీ కరుణ తగ్గిందనా? లేక నీపై నా భక్తి తగ్గిందనా? ఏ కారణం చేత నన్నిలా వేధిస్తున్నావు? నీతో గడిపిన మధుర క్షణాలే తీయని తలపులుగా మది నింపుకుని పొద్దు గడపాలన్నా అవే మరింత వేదన రేపుతున్నాయి!

చెదిరిన మనసుతో యమునా తీరానికి వెళితే ఎగసి పడుతున్న యమునా తరంగాలు 'మా కెరటాల తీరు పోలిన నీ శిరోజాలలో సుగంధాలు వెదజల్లు సుమాలేవి? తాండవ కృష్ణుని జంటగా చేసుకుని ఈ ఇసుక తిన్నెలపై నర్తించే దానివిగా, ఏడీ స్వామి?' అని ప్రశ్నిస్తున్నాయి.

ఏమని జవాబివ్వను? మూగవోయిన నా అధరాలను గమనించి కిలకిలా నవ్వుతూ గలగలా ప్రవహిస్తూందీ యమున. అది నన్ను చూసి చేసే అపహాస్యం కాదా?

అలసిన నేను ఈ బృందావనిలో అడుగిడితే 'మము బోలు నవ్వులు నీ మధురాధరాలపై లేవేం? ఏడీ నీ విభుడు?' అని వనంలోని సుమాలన్నీ ఒక్కసారిగా అడుగుతున్నాయి. ఉక్కిరిబిక్కిరవడం తప్ప ఏమని చెప్పగలను నేను? నీతోనే నా చిరునవ్వులు దూరమయ్యాయని ఈ వనికి తెలియదా? నీతో వుంటేనే ఇది నందనం! లేదా నరకతుల్యమే నాకు.

లోకాన్నంతా తన చల్లని, తెల్లని వెలుగుతో లాలించే జాబిలిక్కూడా నేను అలుసే కాబోలు. 'నన్నే వెలవెలబోసే నీ వదనార విందం ఇలా చిన్నబోయిందేమని?' అడుగుతూ గడుసుగా నవ్వుతాడు. ఇక చుక్కలు వూర్కొంటాయా? "మమ్మే ధిక్కరించే నీ కంటే వెలుగులేవి? ఆ తళుకు చెక్కులేవి?" అని పదేపదే ప్రశ్నిస్తున్నాయి. ఏ చమత్కార సమాధానంతో ఈ ప్రకృతి మూగబోయేలా చేయగలను నేను? నీవు పక్కన లేక ఆ శక్తేది నాలో?

రావోయి రాధాప్రియా! లోకాలన్నీ ఈసుచెందేలా నన్ను నీ దరి చేర్చుకో. నీ పక్కన నన్ను చూసి ఈ పదునాల్గు భువనాలు "రాధికదే కదా అదృష్టమంటే!" అని ఎలుగెత్తి అరవనీ! యుగయుగాల ప్రణయం మన కలయికలో పరవశించనీ!"

అలా కృష్ణుని తలపులనే మది తలుస్తూ, నడుస్తూ పోతున్న రాధ హఠాత్తుగా ఓ చోట నిలిచిపోయింది. కళ్ళలోనే ఆనందకాంతి వెల్లువలా వచ్చి చేరింది. మొదటి క్షణం ఎప్పటివలె తాను భ్రమ చెందే నీల మేఘమేమో అనుకుంది. అంతలో మాధవుని మందహాసం చూసి "నల్లమబ్బులోంచే ఇంత పండు వెన్నెల ఎలా వస్తుందీ?" అని నివ్వెరపోయింది రెండో క్షణం. ఇంతలో లోకాలను మోహంలో ముంచెత్తే దివ్య మురళీగానం వీనుల విందు చేయడంతో నిలువెల్లా మేను పులకరించి తన్మయమైంది మూడో క్షణం. అంతే! కన్నుల నుంచి రాలే బాష్ప బిందువులతో కృష్ణుని పాదాలపై వాలిపోయింది రాధిక ప్రేమా రాధికయై. ఇక సర్వం ఆమెకు కృష్ణమయం! ★